పుచ్చసాగుపై రైతుల ఆసక్తి

- గత వేసవి సీజన్‌లో మంచి ధరలు పలికిన కాయలు
- ఎకరాకు రూ.లక్షకుపైగా లాభాలు గడించిన రైతులు
- ఈ దఫా జిల్లాలో 4500 ఎకరాల్లో సాగు


కావలి రూరల్‌లో సాగుచేసిన పుచ్చ పంట

కావలి: ఈ ఏడాది పుచ్చకాయలు మంచి ధరలు పలికాయి. గత వేసవి సీజన్‌లో ఎండలు బాగా కాయడంతో కాయలకు గిరాకీ ఉండి మంచి ధరలు లభించాయి. దీంతో పుచ్చ పంట సాగు చేసిన రైతులు లాభాలను పొందారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని రైతులు పుచ్చపంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

విస్తారంగా సాగు

పుచ్చ వేసవికి అనువైన పంట. కానీ ప్రస్తుతం అన్ని కాలాలకు అనువైన రకాలు రావడంతో రైతులు అన్ని సీజన్లలోనూ సాగు చేపడుతున్నారు. ఈ ఏడాది ఎండలు బాగా ఉండడంతో పుచ్చ కాయలు మంచి ధరలు పలికాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని రైతులు పుచ్చ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది జిల్లాలోని కావలి రూరల్, బోగోలు, అల్లూరు, జలదంకి, దగదర్తి, కలిగిరి, కొండాపురం, పొదలకూరు, మనుబోలు, విడవలూరు, తదితర మండలాల్లో సుమారు 4,500 ఎకరాల్లో పుచ్చసాగు చేస్తున్నారు. పుచ్చ పంట సాగుచేసిన తరువాత 60 రోజులకు కాయలు చేతికందుతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు వేసవికి కాయలు వచ్చేలా డిసెంబరులోనే సాగు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పుచ్చ పంట దెబ్బతిన్నప్పటికీ రైతులు ఖాతరు చేయకుండా మళ్లీ విత్తనాలు వేసే పనిలో తలమునకలవుతున్నారు.

ఎకరాకు రూ.లక్షకు పైగా ఆదాయం

పుచ్చ సాగుకు ఎకరాకు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు పెట్టుబడులు అవుతాయి. పంట బాగా వస్తే ఎకరాకు 10 టన్నుల నుంచి 15 టన్నుల వరకు దిగుబడులు వస్తాయి. ఈ ఏడాది ఎండలు బాగా ఉండడంతో పుచ్చకాయలకు మంచి గిరాకీ ఉండి మార్కెట్‌లో టన్ను రూ.17వేల వరకు ధర పలికాయి. దీంతో పుచ్చ సాగుచేసిన రైతులకు ఎకరాకు రూ.1,70,000 నుంచి రూ.2,55,000 వరకు చేతికందింది. పెట్టుబడులు పోను ఎకరాకు కనిష్టంగా రూ.లక్ష నుంచి గరిష్టంగా రూ. 2 లక్షల వరకు ఆదాయం లభించింది. గత సీజన్‌లోని ధరలను దృష్టిలో ఉంచుకుని ఈ దఫా రైతులు రెట్టించిన ఉత్సాహంతో పుచ్చసాగు చేస్తున్నారు.


పుచ్చ పిందెలు

సాగులో అప్రమత్తం

పుచ్చ సాగుకు సారవంతమైన ఇసుక, ఎర్రమట్టి నేలలు అనువైనవి. సాగునీరు సైతం పుష్కలంగా ఉండాలి. అందుకే సాగునీటి సౌకర్యం ఉన్న రైతులు మాత్రమే ఎక్కువగా పుచ్చసాగు చేస్తారు. ప్రస్తుతం రైతులు ఎక్కువగా డ్రిప్ పద్ధతిలో సాగు చేపడుతున్నారు. డ్రిప్ విధానంలో కలుపు నివారణ, వేసవిలో నీటిని అందించడం సులువుగా ఉంటుండడం ..అధిక దిగుబడులు వస్తుండడంతో రైతులు దాన్నే అనుసరిస్తున్నారు. విత్తనం విత్తిన నాటి నుంచి నేల స్వభావాన్ని బట్టి తేమ తగ్గకుండా నీటిని అందిస్తూ ఉండాలి. పూత, కాయ మొదలయ్యే సమయాల్లో నీటిని పుష్కలంగా అందించాలి. కాయలు పక్వానికి వచ్చే సమయంలో నీటిని అందించడం తగ్గించాలి. ఈ సమయంలో నీటికి ఎక్కువగా అందిస్తే కాయలు పగలడం జరుగుతుంది. అలాగే కాయ రుచి, నాణ్యత తగ్గుతుంది.

మెలకువలు పాటించాలి

సాగునీటి సౌకర్యం ఉన్న రైతులు మాత్రమే పుచ్చ పంటను ఎంచుకోవాలి. నేల స్వభావాన్ని బట్టి విత్తనం నాటినప్పటి నుంచి 5 నుంచి 7 రోజులకు ఒక్కసారి నీటిని అందించాలి. పూత, పిందెలు పడ్డాక సాగునీటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. కాయలు పక్వానికి వచ్చే సమయంలో సాగునీటిని అందించడం తగ్గించాలి. ఈ సమయంలో నీటిని ఎక్కువగా అందిస్తే కాయలు పగులుతాయి. కాయ రుచి, నాణ్యత సైతం తగ్గుతుంది. డ్రిప్ విధానంలో సాగుచేస్తే ఉదయం సమయంలో రోజుకు 20 నుంచి 30 నిమిషాల పాటు మాత్రమే నీటిని అందించాలి. మొక్క 3 నుంచి 4 ఆకులు వేసిన సమయంలో లీటర్ నీటికి 3 గ్రాముల బోరాక్స్ కలిపి పిచికారీ చేయడం వల్ల కాయ పగుళ్లను నివారించవచ్చు. మొక్క మీటరు పొడవు పెరిగిన సమయంలో చివర్లను తుంచి వేయడం వల్ల పక్కకొమ్మలు పెరిగి అధిక దిగుబడులను పొందవచ్చు. పంట వేసిన 25 నుంచి 30 రోజుల తరువాత ఎకరాకు 30 నుంచి 32 కిలోల యూరియా (నత్రజని) వేసుకోవాలి. 55 నుంచి 60 రోజుల మధ్యన 15 కిలోల యూరియా, మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.

–ఎం.సుధామయి, ఉద్యాన అధికారిణి, కావలి

యూరియా కోసం రైతుల క్యూ


గురువారం రాత్రి అల్లూరు సొసైటీలో యూరియా కోసం క్యూలో రైతులు

అల్లూరు: అల్లూరులోని సొసైటీ కార్యాలయం వద్ద యూరియా కోసం గురువారం క్యూ కట్టారు. మండలంలో రబీ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో యూరియాకు డిమాండ్ నెలకొనడంతో ప్రైవేట్ డీలర్లు బస్తా రూ.400 వరకు విక్రయిస్తున్నారు. దీంతో సొసైటీ వద్ద రైతులు క్యూ కడుతున్నారు. సొసైటీలో బస్తా రూ.270కే విక్రయిస్తుండడంతో పలుకుబడి ఉన్న వారు, బడాబాబులు వచ్చిన వెంటనే తీసుకెళ్తుండగా, చిన్న, సన్నకారు రైతులు మాత్రం ఉదయం నుంచి రాత్రి వరకు పడిగాపులు పడుతున్నారు.

చేజర్లలో చిరుజల్లులు

చేజర్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలో గురువారం ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తున్నాయి. వరినాట్ల సీజన్ కావడం.. వర్షానికి కూలీలు రాక రైతులు ఇబ్బందులు పడ్డారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

సీతారామపురం: మండలంలోని నాంచారమ్మపల్లికి చెందిన జస్వికకు రూ.3,39,075, సీతారామపురానికి చెందిన దూదేకుల హజరత్‌కు రూ.75 వేల చొప్పున సీఎం సహాయ నిధి నుంచి చెక్కులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను బాధితులకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వింజమూరులోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు.

క్లుప్తంగా

పెండింగ్ కేసులను పరిష్కరించండి



సంగం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ గురువారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్సై రాజేష్‌ను ఆదేశించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ క్రిస్మస్, సంక్రాంతి సెలవులకు ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే వారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. గంజాయి కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించామని, తల్లిదండ్రులు తమ పిల్లలపై కన్నేసి ఉంచాలన్నారు. సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట సంగం సీఐ వేమారెడ్డి ఉన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన డీఈఓ



కలిగిరి: కలిగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని డీఈఓ బాలాజీరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి విద్యార్థినుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల పరిసరాలు, వంట గదులను పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపల్ సుప్రియ, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



కావలి: పట్టణంలోని సంయుక్త సేవా సంస్థ సంరక్షణలో ఉన్న చిన్నారులకు కావలికి చెందిన లంకపల్లి శ్రీనివాసరావు గురువారం నిత్యావసర సరుకులను వితరణ చేశారు. తన తండ్రి లంకపల్లి నరసింహారావు పదో వర్ధంతి సందర్భంగా నిత్యావసర సరుకులను వితరణ చేసినట్లు ఆయన తెలిపారు. లంకపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు లంకపల్లి హన్సినీ, అమృత, వైష్ణవి, నిహాల్‌రావు, ధనుష్, దీపక్, హర్షిత్, సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు దుప్పట్ల వితరణ



ఆత్మకూరు: అనంతసాగరంలోని బీసీ సంక్షేమ వసతిగృహ విద్యార్థులకు దాత కే ప్రసాద్ దుప్పట్లను వితరణ చేశారు. ఈ దుప్పట్లతో పాటు ప్రభుత్వం అందజేసిన నేలపై పరుచుకునే ప్లాస్టిక్ షీట్లను వార్డెన్‌కు వసతిగృహ ప్రత్యేకాధికారి, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్ ఆత్మకూరులోని బీసీ సంక్షేమాధికారిణి కార్యాలయంలో గురువారం అందజేశారు. ఏఎస్‌డబ్ల్యూఓ సీహెచ్ శ్రీదేవి, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాపై శిక్షణ



ఆత్మకూరు: నిత్యం యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆత్మకూరు సీఐ జీ గంగాధర్ అన్నారు. పట్టణంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో పోలీసులు, వారి పిల్లలకు గురువారం యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఆరోగ్య సమస్యలు దరిచేరవన్నారు. ఎస్సైలు ఎస్‌కే జిలానీ, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

బెడుసుపల్లిలో తాగునీటి ఎద్దడి

సీతారామపురం: మండలంలోని బెడుసుపల్లిలో తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలోని మంచినీటి పథకం మోటార్ పదిరోజుల క్రితం మరమ్మతులకు గురైంది. అప్పట్నుంచి పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంబేడ్కర్‌ను అవమానించడం దారుణం



నిరసన తెలుపుతున్న ఎస్ మల్లి

కావలి: పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించడం దారుణమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి ఖండించారు. పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లే నేడు దేశంలోని 141కోట్ల మంది ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కుల ద్వారానే అది సాధ్యమైందన్నారు. అటువంటి మహానుభావుడిని అవమానించడం దారుణమని మండిపడ్డారు. అమిత్‌షా వెంటనే భారత జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలా జరిగే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఆలూరి బ్రహ్మయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు జరుగుమల్లి విజయరత్నం, రమేష్, జనార్దన్, జీ తిరుపతి పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించడం దారుణమని, ఆయన విగ్రహం వద్ద కాళ్లు పట్టుకుని అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలి లేదా రాజీనామా చేయాలని సామాజిక కార్యకర్త సీహెచ్ శారద గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాంగ దినోత్సవాలు..వజ్రోత్సవాలు అంటూ పెద్దఎత్తున ప్రచారం చేస్తూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం ఏర్పాటైన పార్లమెంట్ సమావేశాల్లోనే ఆయనను తలచుకుంటూ కూర్చునే బదులు దైవనామ స్మరణ చేసుకుంటే స్వర్గం ప్రాప్తించేది అని అంటూ రాజ్యాంగ నిర్మాతను కించపరుస్తూ కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడటం రాజ్యాంగాన్నే తూలనాడడమని ఆమె మండిపడ్డారు. రాజ్యాంగానికి తలవంపులు తెచ్చేలా అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ప్రజాతంత్రవాదులు తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. దేశాన్ని కులాల కురుక్షేత్రంగా మతాల మారణ హోమంగా మార్చే ప్రయత్నాలను కేంద్రంలోని పాలకులు మానుకోవాలని ఆమె హితవు పలికారు.

అల్లూరు: అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్రాధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు క్షమించలేనివన్నారు. అంబేడ్కర్‌ను ప్రేమించిన ప్రతిఒక్కరూ తగిన బుద్ధి చెబుతారన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి


సీహెచ్‌సీలోని సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి: ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్య సిబ్బంది కృషిచేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయగిరి బాగా వెనుకబడిన ప్రాంతం కావడంతో పేదలు ప్రభుత్వ వైద్యశాలకు ఎక్కువగా వస్తుంటారని, వారిని దృష్టిలో ఉంచుకుని వైద్యసిబ్బంది మెరుగైన సేవలందించాలన్నారు. అనంతరం వైద్యశాలలోని సమస్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై వైద్యులతో చర్చించారు. వైద్య సిబ్బంది కొరతను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భర్తీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీడీఓ అనీషా, వైద్యులు సింధూర, ప్రశాంత్, ఎంపీడీఓ అప్పాజీ, ఈఓపీఆర్డీ కరిముల్లా, కమిటీ సభ్యులు కలివెల జ్యోతి, స్థానిక టీడీపీ నేతలు బయ్యన్న, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం


ఆత్మకూరురూరల్: మాట్లాడుతున్న ఆత్మకూరు ఆర్డీఓ పావని

దుత్తలూరు: ప్రభుత్వం భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని మండల నోడల్ అధికారి, డీఈఓ బాలాజీరావు తెలిపారు. మండలంలోని లక్ష్మీపురంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి విచారణ జరిపి భూసమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. తహసీల్దార్ యనమల నాగరాజు, సర్పంచ్ యనమల సుబ్బమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ

దుత్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ బాలాజీరావు తనిఖీ చేశారు. పదోతరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు.

రెవెన్యూ సదస్సుకు అర్జీల వెల్లువ

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని తమిదపాడులో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు అర్జీలు వెల్లువెత్తాయి. తహసీల్దార్ హమీద్‌కు భూ సమస్యలపై 33 మంది అర్జీలు అందజేశారు. రీసర్వే, భూ పట్టాల కోసం అర్జీలు ఎక్కువగా అందినట్లు ఆయన తెలిపారు. అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఐ ఇమ్రాన్‌ఖాన్, వీఆర్వో రమణయ్య, సర్వేయర్ రవి,తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: సీతారామపురంలోని బిట్–1 సచివాలయంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 40 అర్జీలు అందినట్లు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో పేర్లు మార్పు, పాస్ బుక్‌ల మంజూరు, సాదాబైనామా, వారసత్వ పేర్ల నమోదు, భూవిస్తీర్ణంలో తేడాలు, తదితర సమస్యలపై అర్జీలు అందాయని తహసీల్దార్ వివరించారు. సర్పంచ్ భాగ్యకుమారి,ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వో ఖాజామొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావుపాళెం, బట్టేపాడులో తహసీల్దార్ సుధీర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. అప్పారావుపాళెంలో ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కాగా రెండు గ్రామాల్లో కలిపి 35 అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు. డీటీ స్వరూప్, వీఆర్వోలు బికారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లాక్డ్‌హౌస్ మానిటరింగ్ విస్తృత ప్రచారం

సంగం: ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు సంగం ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సేవలపై ఆటో ద్వారా గురువారం విస్తృతంగా ప్రచారం చేశారు. క్రిస్మస్, సంక్రాంతి సెలవులకు ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే వారు పోలీసు స్టేషన్‌లో సమాచారం అందజేస్తే లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం ద్వారా భద్రత కల్పిస్తామని తెలిపారు. ఊర్లకు వెళ్లేవారు ఇళ్లలోని విలువైన వస్తువులను తమ బంధువుల వద్ద ఉంచి వెళ్లాలని సూచించారు. ఏఎస్సై జాకీర్, హెడ్ కానిస్టేబుల్ శిఖామణి పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలి

సోమశిల/సంగం/అనుమసముద్రంపేట : అనంతసాగరం, సంగం, అనుమసముద్రంపేట మండల పరిషత్ కార్యాలయాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రజాప్రతినిధులు, అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం గురువారం కూడా కొనసాగింది. అనంతసాగరంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. సంగం, ఏఎస్‌పేటలో శిక్షణను రాష్ట్ర పరిశీలకులు రమేష్, ప్రసాద్ పరిశీలించారు. డీఎల్‌పీఓ నారాయణ, సంగం, అనంతసాగరం ఎంపీడీఓలు షాలెట్, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ పాల్గొన్నారు.

బ్యాంకు లోన్ పేరుతో బురిడీకి యత్నం

కావలి: సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పంథాను అనుసరిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా మీరు బ్యాంకులో లోన్ తీసుకున్నారు... ఎప్పుడు చెల్లిస్తారంటూ.. కావలికి చెందిన ఓ వ్యక్తికి ఫోన్ చేసి బురిడీ కొట్టించేందుకు యత్నించారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు..కావలికి చెందిన ఓ వ్యక్తి ఫోన్‌కు బుధవారం కాల్‌రాగా ఎత్తాడు. అవతలి వ్యక్తి 'హలో.. నేను హైదరాబాద్‌లోని రత్నాకర్ బ్యాంక్ లిమిటెడ్ (ఆర్‌బీఎల్) బ్యాంక్ అమీర్ పేట బ్రాంచ్ నుంచి కాల్ చేస్తున్నా. మా బ్యాంక్‌లో మీరు రూ.2 లక్షలు అప్పు తీసుకున్నారు. వడ్డీ రూ.50 వేలు అయింది....ఎప్పుడు చెల్లిస్తారు..' అని అడిగాడు. దీంతో అప్రమత్తమైన కావలి వాసి మీరు ఎవరికి ఫోన్ చేశారని ప్రశ్నించగా శీలం లక్ష్మీనారాయణకు అని చెప్పాడు. అది తన పేరు కాదని..రాంగ్ నంబర్ అని కావలి వ్యక్తి చెప్పగా, కాల్ చేసిన వ్యక్తి లోన్ తీసుసుకున్న వ్యక్తి రెఫరెన్స్ కోసం మీ ఫోన్ నంబర్‌ను ఇచ్చాడని చెప్పాడు. దీంతో శీలం లక్ష్మీనారాయణ పేరు కలిగిన వ్యక్తి ఎవరో తనకు తెలియదని, తన ఫోన్ నంబర్‌ను రెఫరెన్స్‌గా ఎలా రాసుకున్నారని కావలివాసి ప్రశ్నించగా, తాను బ్యాంక్ ఉద్యోగిని అని, బ్యాంక్ కస్టమర్ కేర్ విభాగంలో పని చేస్తానని, అప్పులు (రుణాలు) ఇచ్చే విభాగం నుంచి వివరాలు తనకు వచ్చాయని ఫోన్ చేసిన వ్యక్తి తెలిపారు. సరే ఇప్పుడు ఏం చేద్దాం అని కావలి వ్యక్తి అడగగా, చేసేది ఏముంది మీతో మాట్లాడిన మాటలు రికార్డు అవుతాయని, వాటిని బ్యాంక్ అధికారులు పరిశీలించుకుంటారని అన్నారు. కాల్ చేసిన 73169 13182 నంబర్‌కు ఇన్‌కమింగ్ కాల్స్ రావని, ఇది జంక్ కాల్ అని, తన పేరు రాజేష్ అని, తన ప్రైవేట్ ఫోన్ నంబర్‌ను చెప్పకూడదని చెప్పి ఫోన్ పెట్టేశారు. సదరు నంబర్‌ను ట్రూకాలర్‌లో పరిశీలించగా జంక్ కాల్ అని నమోదైంది.

13 మంది నుంచి రక్తనమూనాల సేకరణ


పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది


వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మర్రిపాడు: మండలంలోని వెంకటాపురంలో మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి గోపినాథ్ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. జికా వైరస్ కలకలం నేపథ్యంలో ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేపట్టారు. బాలుడికి దగ్గరగా ఉన్న 13 మంది నుంచి రక్త నమూనాలను సేకరించి జిల్లా కేంద్రానికి పంపారు. అలాగే ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్ ఆదేశాలతో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. వీధుల్లోని మురుగును తొలగించి బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

శిథిలావస్థలో గ్రంథాలయ భవనం

- శ్లాబు దెబ్బతిని బయటపడిన కమ్ములు
- వర్షం పడితే ఉరుస్తూ తడిసిపోతున్న పుస్తకాలు
- ఇబ్బందులు పడుతున్న పాఠకులు


వర్షపు నీరు కారుతుండడంతో పుస్తకాలు తడవకుండా ర్యాక్‌పై పట్టను కప్పిన దృశ్యం


శ్లాబు దెబ్బతిని బయటపడిన కమ్ములు

అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన అనుమసముద్రంపేటలోని గ్రంథాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. శ్లాబు దెబ్బతిని వర్షం పడితే ఉరుస్తుండడంతో పుస్తకాలు తడిసి ముద్దవుతున్నాయి. శ్లాబు పెచ్చులూడి పడుతుండడంతో గ్రంథాలయంలో కూర్చునేందుకు పాఠకులు భయపడుతున్నారు. ఆరుబయటే పుస్తక పఠనం చేస్తున్నారు. వర్షం పడిన సమయంలో ఎక్కడా కూర్చునే వీల్లేక గ్రంథాలయానికే రావడమే మానేస్తున్నారు.

1988లో భవన నిర్మాణం

అనుమసముద్రంపేటలోని గ్రంథాలయ భవనాన్ని 1988లో నిర్మించారు. ప్రస్తుతం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబు దెబ్బతిని పెచ్చులూడి పడుతుండడంతో లోపల కూర్చునేందుకు పాఠకులు జంకుతున్నారు. ఆరుబయటే పుస్తక పఠనం చేస్తున్నారు. భవనానికి ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షం పడితే మొత్తం ఉరుస్తోంది. దీంతో విలువైన పుస్తకాలు తడిసి ముద్దవుతున్నాయి. పుస్తకాలను సంరక్షించేందుకు గ్రంథాలయాధికారి పడరాని పాట్లు పడుతున్నారు. వర్షాకాలంలో గ్రంథాలయానికి వెళ్లి పుస్తక పఠనం చేసే వీల్లేకపోవడంతో పాఠకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులతో పాటు విద్యార్థులు తమ జ్ఞానాన్ని పెంచుకునేందుకు వస్తుంటారు. గ్రంథాలయం దుస్థితిలో ఉండడంతో వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రంథాలయం దుస్థితిని వివరిస్తూ జిల్లా అధికారులకు గ్రంథాలయాధికారి పలుమార్లు లేఖలు పంపినప్పటికి స్పందన లేదు. ఇటీవల రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి సైతం సమస్యను తీసుకెళ్లి నూతన భవనాన్ని మంజూరు చేయాలని కోరినా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నూతన గ్రంథాలయ భవనాన్ని మంజూరు చేయాలని, లేని పక్షంలో మరమ్మతులు అయినా చేపట్టాలని పాఠకులు కోరుతున్నారు.

నూతన భవనం నిర్మించాలి



గ్రంథాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. శ్లాబు దెబ్బతిని పెచ్చులూడి పడుతుండడంతో గ్రంథాలయంలో కూర్చునేందుకు పాఠకులు భయపడుతున్నారు. ఆరుబయటే పుస్తక పఠనం చేస్తున్నారు. అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణం చేపట్టాలి.

– హరికృష్ణారెడ్డి, పాఠకుడు

వర్షం పడితే ఉరుస్తోంది



గ్రంథాలయ భవనం శ్లాబు దెబ్బతినడంతో వర్షం పడితే ఉరుస్తోంది. పుస్తకాలు తడిసి ముద్దవుతున్నాయి. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు గ్రంథాలయానికి వస్తుంటారు. వర్షం వస్తే గ్రంథాలయంలో కూర్చునేందుకు వీల్లేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి గ్రంథాలయ భవనానికి మరమ్మతులు చేయించాలి.

– పరంధామయ్య, పాఠకుడు